
చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4

స్తంభోద్భవుడి సన్నిధిలో..



యాదగిరిగుట్ట కొండపైన విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, వేదపండితులు

వైభవంగా చక్రతీర్థ స్నానం

- యాగశాలలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి
- కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తుల పుణ్యతీర్థ స్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

స్తంభోద్భవుడు.. ఏకశిఖరవాసుడు.. స్వయంభు పాంచనారసింహుడు వెలిసిన.. మహిమాన్విత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీచక్రత్ ఆళ్వార్ల అవబృత స్నానం, యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. దీంతోపాటు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపు ఉత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రాధాన్యమున్న ఘట్టం చక్రతీర్థ స్నానం. ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను మంగళవాయిద్యాలు, వేదపారాయణలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి చక్రతీర్థస్నానం నిర్వహించారు. అంతకుముందు వసంతోత్సవం వైభవంగా సాగింది.

● యాదగిరిగుట్ట

•7లో..





గవర్నర్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న సీఎస్ శాంతికుమారి

గుండెల నిండా ఆనందం

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

యాదగిరీశుడి దర్శనంతో గుండెల నిండా ఆనందం కలిగిందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. బుధవారం ఆయన యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో పాల్గొన్నారు. ఆయన హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డుమార్గంలో సాయంత్రం 7.10గంటలకు యాదగిరిక్షేత్రానికి విచ్చేశారు. కొండపైన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సాయంత్రం సుమారు 8.45గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. యాదగిరిక్షేత్రంలో గవర్నర్ పర్యటన సుమారు గంట 35 నిమిషాలపాటు సాగింది. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆయనకు సీఎస్ శాంతికుమారి, ఆలయ అర్చకబృందం, దేవస్థాన, జిల్లా యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. కొండపైన పడమటి దిశలోని అతిథి గృహం వద్దకు చేరుకోగా జిల్లా పోలీసు అధికారులు ఆయనకు గౌరవ వందనం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్కడ చూసినా రాతి శిలల నిర్మాణాలే కనిపిస్తున్నాయని, ఇంతటి మహిమాన్విత ఆలయంలోనికి అడుగు పెట్టగానే ఏదో తెలియని ఆధ్యాత్మికానుభూతి కలిగిందన్నారు. అనంతరం ఆయన అక్కడ నుంచి ఉత్తర దిశలోని లిఫ్టు గుండా పడమటి దిశలోని అతిథి గృహానికి చేరుకుని కాన్వాయ్‌లో తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ఆయన వెంట దేవస్థాన, జిల్లా అధికారులు తదితరులున్నారు.

వ్యవసాయరంగానికి పునరుజ్జీవం కోసం

- నేటి నుంచి రెండు రోజుల పాటు సదస్సు
- దక్షిణ తెలంగాణ ప్రాంతీయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నాణ్యతలేని విత్తనాలు, మార్కెటింగ్ కొరత



వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వరి, పండ్లతోటలు ఎక్కువగా సాగుచేస్తారు. ఈ పంటల సాగుతో పాటు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారాలు లభిస్తే తప్ప సాగు లాభదాయకం కాదని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో పంటలసాగు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురవుతున్న సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పూనుకుంది. అందులో భాగంగా నల్లగొండలో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ నెల 21, 22న రెండు రోజులపాటు ఈ సమావేశాలు నిర్వహించనుంది.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో 9.37లక్షల ఎకరాల్లో సాగయ్యే వరిలో అత్యధిక భాగం నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉంది. వరిలో ప్రధానంగా ఉల్లికోడు, మొవ్వతెగులు వంటి చీడపీడలు, సుడిదోమ తాకిడితో దిగుబడులపై ప్రభావం చూపి రైతులు నష్టపోతున్నారు. ప్రైవేట్ విత్తనాలపైనే రైతులు ఎక్కువగా ఆధారపడడంతో, నాణ్యతలేని విత్తనాలతో దిగుబడులు తగ్గి అప్పులపాలవుతున్నారు. కూలీల కొరత నేపథ్యంలో యాంత్రిక వ్యవసాయానికి వరి సాగే అనుకూలమవడంతో రైతులు ఎక్కువగా వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. దీంతో వరి సాగు రైతులకు లాభసాటిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ధాన్యం మార్కెటింగ్‌కు రైతులు అవస్థలు పడుతున్నారు. పంట పండిన తర్వాత రైతులు విక్రయించుకునేందుకు నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో పెట్టుబడికి సమాంతరంగా ధర వచ్చే అవకాశాలు లేకపోవడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. వరి తరువాత అత్యధికం ఎకరాల్లో సాగయ్యే పత్తిలోనూ రైతులు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా నాసిరకం విత్తనాలు, బెట్ట, అధిక వర్షపాతాన్ని తట్టుకునే వంగడాలు లేకపోవడం, జిల్లాలోని మెట్టభూములకు అనుకూలమైన విత్తనాలు లేకపోవడం వంటి ప్రతికూలతలతో పత్తి రైతులు నష్టపోతున్నారు. వీటితో పాటు పత్తికి మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా, రైతులకు మాత్రం ఆశించిన ధర లభించక దళారీలను ఆశ్రయిస్తున్నారు. వేరుశనగ, కంది పంటల సాగుకు జిల్లా నేలలు అనుకూలమైనా, పందులు, కోతుల బెడదతో ఈ పంటల సాగుకు రైతులు ముందుకురావడం లేదు. అరకొరగా రైతులు ఈ పంటలు సాగుచేసినా, పంట చేతికొచ్చేంతవరకు నమ్మకం లేదు. వీటితోపాటు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా సుమారు 7లక్షల ఎకరాల్లో బత్తాయి తోటలు, మరో 1.50లక్షల ఎకరాల్లో నిమ్మతోటలు సాగవుతున్నాయి. ఈ పండ్ల తోటల సాగుకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భజలాలు తగ్గిన ప్రస్తుత పరిస్థితుల్లో పంటల దిగుబడిపై ఆ ప్రభావం కనిపిస్తోంది. నీటి వసతి లేకపోవడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కూడా రైతులకు జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో వారు అనివార్యంగా దిగుబడులను దళారులకు విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ సదుపాయంతో పాటు, నీటి వసతి కోసం డ్రిప్ ఇరిగేషన్, యంత్రాలను సబ్సిడీపై ప్రభుత్వం అందించి పంటల సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలో రైతులు మార్కెటింగ్ సమస్యను ప్రధానంగా ఎదుర్కొంటున్నారని, దీన్ని అధిగమించేందుకు ఫుడ్‌పార్క్ ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా, అది నెరవేరలేదు. జిల్లాలో వరి, బత్తాయి వంటి ప్రధానమైన పంటలకు సంబంధించి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా, రైతులు పంటలసాగులో, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కారం సూచించే ఉద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నల్లగొండలో ఈ నెల 21, 22న రెండు రోజులపాటు సలహా మండలి సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో ఉమ్మడి జిల్లా రైతులు వరి సాగు, ఇతర ఆరుతడి, ఉద్యాన పంటల సాగులో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, రైతులకు ఎలాంటి మద్దతు ఇవ్వాలనే అంశంపై ఈ సదస్సు సూచించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు, రేపు సమావేశాలు

నల్లగొండ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21, 22న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ అధికారుల సలహా సంఘ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు కంపసాగర్ శాస్త్రవేత్త జి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత వ్యవసాయరంగంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వాటిని తీర్చే దిశగా పరిశోధనలు చేపట్టడం, సమస్యలకు సరైన పరిష్కారం అందించడంపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. గత ఏడాది రైతులు లేవనెత్తిన అంశాలకు సాంకేతిక పరమైన పరిష్కారాలు తెలియజేయడంతో పాటు గత ఏడాది వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ అధికారులు, అనుబంధశాఖల అధికారులు, 11 జిల్లాల రైతులు పాల్గొంటారని తెలిపారు. రైతులు ఈ సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఎం ఒంటరి పోరు

● భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఎండీ జహంగీర్



ఎండీ జహంగీర్

యాదాద్రి, మార్చి20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సీపీఎం ఒంటరి పోరుకు సిద్ధమైంది. సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్‌ను రాష్ట్ర కమిటీ బుధవారం ప్రకటించింది. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాల నుంచి పోటీలో ఉండటనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర కమిటీ, రాష్ట్రంలోనే సీపీఎం నుంచి మొదటి అభ్యర్థిగా జహంగీర్‌ను ప్రకటించింది. ఈస్థానం నుంచి పోటీలో ఉంటున్నట్లు ఇటీవల ఆపార్టీ నేతలు కూడా వ్యాఖ్యానించారు. ఈమేరకు పార్టీ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమైంది. జహంగీర్ స్వగ్రామం రామన్నపేట మండలం మునిపంపుల. విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐలో చేరి, ప్రజా సంఘాల్లో పనిచేస్తూ పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. వామపక్ష భావజాలంతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. గత ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గం నుంచి సీపీఎం, సీపీఐలు పోటీచేశాయి. 2009లో సీపీఎంనుంచి మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, 2014 ఎన్నికల్లో సీపీఎం జాతీయ కార్యవర్గసభ్యుడు చెరుపల్లి సీతారాములు పోటీ చేశారు. 2019 ఎన్నికల్లో ఈస్థానం నుంచి సీపీఐ అభ్యర్థి గోదా శ్రీరాములు పోటీ చేశారు. భువనగిరి నియోజకవర్గం ఏర్పడకముందు పూర్వపు నల్లగొండ నియోజకవర్గంగా ఉండేది. ఆ సమయంలో ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ-వామపక్ష మిత్ర పక్షాల అభ్యర్థులుగా సీపీఐ నుంచి బొమ్మగాని ధర్మభిక్షం, సురవరం సుధాకర్‌రెడ్డిలు ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. సీపీఐ నుంచి పోటీ చేసేందుకు రాష్ట్రంలో ఏదైనా ఒక నియోజకవర్గాన్ని కేటాయించాలని పార్టీ అధిష్ఠానం కాంగ్రెస్ పార్టీకి విజ్ఞప్తిచేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ ఉమ్మడిగా కలిసి పోటీ చేశాయి. ఈ నేపథ్యంలో తమకు ఒక సీటు కేటాయించాలని కోరాయి. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఇప్పటివరకు సీపీఐకి టికెట్ కేటాయింపుపై ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. ఈ నేపథ్యంలో సీపీఐ భువనగిరి స్థానం నుంచి ఎన్నికల బరిలో ఉంటుందా? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

జిల్లా అంతటా పటిష్ఠ నిఘా

● కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ● సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై దృష్టి : ఎస్పీ రాహుల్ హెగ్డే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, చిత్రంలో రాహుల్ హెగ్డే

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అంతటా పటిష్ఠ నిఘా పెంచాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి ఆయన మాట్లాడారు. బ్యాంకర్లు డిజిటల్ లావాదేవాలపై నిఘా పెంచాలన్నారు. బ్యాంక్ లావాదేవాలు రూ.5లక్షల నుంచి రూ. 10లక్షల వరకు జరిగే వాటిపై, పోస్టల్ శాఖ ద్వారా జరిగే లావాదేవీలపై నిఘా ఉంచాలన్నారు. ఎక్సైజ్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటూ లిక్కర్‌తోపాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, ఎక్సైజ్ పర్యవేక్షకులు లక్ష్మనాయక్, డీఎఫ్‌వో సతీ‌ష్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మీడియా సహకారం అవసరం

పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో మీడియా సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే బీకేతో కలిసి మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా అందుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాస్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం వంటివి సంబంధిత అభ్యర్థి వ్యయంలో లెక్కిస్తామన్నారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనలు చేస్తే వాటిని సకాలంలో అమోదిస్తూ మంజూరు చేయాలన్నారు. ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే ప్రకటనలు, వీడియోలను విడుదల చేయాలన్నారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్నికల నియమావళిని అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తప్పుడు వార్తలు, ప్రకటనలు ప్రసారం చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీపీఆర్‌వో రమేష్‌కుమార్, డీఐఈ మల్లేషం, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల హద్దులను ఏర్పాటు చేయాలి

జిల్లాలో అటవీ భూములకు హద్దులను పటిష్ఠంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్ హెగ్డేబీకే, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపాలెంలో అటవీ భూములను గుర్తించి వాటికి సరిహద్దులు నాటాలన్నారు. అటవీ భూములకు హద్దులు లేక పోవడంతో గ్రామస్థులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కృష్ణా నదిలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలన్నారు. ఎలాంటి పన్నులు చెల్లించకుండా అనధికారికంగా నడిచే వాహనాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డీఎఫ్‌వో సతీష్‌కుమార్ జిల్లాలోని అటవీ ప్రాంతం, అడవుల సంరక్షణ, ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావు, డీటీడబ్ల్యూవో శంకర్, జిల్లా మైనింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

జిల్లాలో మిగిలి ఉన్న ఉపాధి కూలీల బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం సత్వరమే చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీవో, పోస్టల్ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంకా 8,925 మంది ఉపాధి హామీ పథకం కూలీలు ఆధార్‌కు బ్యాంకు అకౌంట్ అనుసంధానం చేయలేదన్నారు. సమావేశంలో డీఆర్‌డీవో జి.మధుసూధన్ రాజు పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం



పునః ప్రతిష్ఠ అనంతరం ఉత్సవమూర్తులు, హాజరైన భక్తులు

కోదాడ/కోదాడటౌన్, మార్చి 20: కోదాడ పట్టణంలో కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా కొనసాగింది. ఉదయం 10.02 నిమిషాలకు దేవానంద జీయర్ స్వామి చేతులమీదుగా విగ్రహ ప్రాణప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, సంప్రోక్షణ అనంతరం, మహాపూర్ణాహుతి, గర్భాలయ ప్రవేశం చేపట్టారు. ఆలయంలో సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు, అన్నపూర్ణ సమేత భోలా లింగేశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణుడు, ఆంజనేయస్వామి, రామానుజచార్యులు, వాసవికన్యకా పరమేశ్వరి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ అంటూ భక్తుల నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. స్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు భారీ ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఉదయం వేద పండితులు విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహోత్సవానికి విచ్చేసిన భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా నాలుగు రోజులుగా రామ్మూర్తి నగర్‌లో ఏర్పాటుచేసిన యాగశాలలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంతోపాటు పరిసర గ్రామస్థులు రావటంతో కోదాడ పట్టణం భక్తులతో కిక్కిరిసింది. డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నాగుబండి రంగా తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం మూడు పియర్లు కుంగినా నష్టంలేదు

● మాజీ మంత్రి జగదీ‌ష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీ‌ష్‌రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 20: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఉద్దేశపూర్వకంగా కరువు సృష్టిస్తుందని, కాళేశ్వరంలో మూడు పియర్లు కుంగినా నష్టమేమీ లేదని, మోటార్ల ద్వారా ఇప్పటికీ నీళ్లు ఇవ్విచ్చని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నీళ్లు ఇవ్వలేని దద్దమ్మలు.. మంత్రులు ఉమ్మడి జిల్లాను ఏలుతున్నారని, మంత్రివర్గంలో వన్, టూ అంటూ ఫోజులు కొడుతున్నారని విమర్శించారు. ఆంధ్రాకు 12 రోజులపాటు నీరు తరలించుకుపోతే నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్ నోరు మెదపలేదన్నారు. ఒకటి రెండు తడులకు నీరు ఇవ్వాలని నెత్తీనోరు మొత్తుకున్నా పట్టించుకోలేదన్నారు. ఒక్క తడికి నీరు ఇచ్చినా మూడున్నర లక్షల ఎకరాల పంటలను కాపాడుకోవచ్చన్నారు. చేతకాని దద్దమ్మల చేతిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం పేరు చెప్పి రైతులకు నీరు ఇవ్వకుండా కరువు సృష్టించారని ఎద్దేవాచేశారు. రైతులకు నీళ్లు ఇస్తే పంటలు బాగా పండితే, రైతులకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే కరువు అంటూ చేతకాని మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు కేసీఆర్ రైతులకు రైతుబంధు ఇస్తామంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని, కాంగ్రెస్ నాయకులను రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామంటున్నారని, మరి ఇప్పుడు ఎవరిని చెప్పుతో కొట్టాలని ప్రశ్నించారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ కర్ణాటక నుంచి నీళ్లు తీసుకొచ్చి తెలంగాణ రైతాంగానికి సరఫరా చేయాలన్నారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్య, ఎంఎల్‌సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, బెల్లంకొండ అమర్ గౌడ్, ముల్కలపల్లి రాంబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, సైదులుయాదవ్, రంగాచారి, అప్పిరెడ్డి, పిచ్చయ్య, కెవిఎల్ఎన్‌రెడ్డి, జక్కుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా కేంద్రానికి అశోక్‌తేజ రాక



సూర్యాపేటటౌన్, మార్చి 20: జిల్లా కేంద్రంలో గురువారం జరిగే గాన కచేరికి సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ రానున్నట్లు మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షుడిగా మీలా మహదేవ్, ముఖ్యఅతిథిగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య రానున్నారని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో రూ.9.09లక్షలు స్వాధీనం



రామాపురం చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీన పత్రాన్ని అప్పగిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, కోదాడ రూరల్, పెన్‌పహాడ్, మార్చి 20: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.9.09లక్షల నగదును పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో పలువురి నుంచి రూ.5.12లక్షల నగదు, బెల్టు షాపుల నుంచి రూ.2,925 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి పోలీ‌స్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన వాహన తనిఖీల్లో ఈ నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఆంధ్రా సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్డు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నాలుగు వాహనాల నుంచి రూ. 3.03 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని దూపహాడ్‌లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి నుంచి రూ.94 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నర్సింహ(ఫైల్)

గుర్రంపోడు, మార్చి 20: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆమలూరు గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరి నర్సింహ(52) తన ఇంటికి నిర్మించిన ప్రహరీకి ఫ్లోరింగ్ చేస్తుండగా మోటారుకు అమర్చిన విద్యుత్తు వైర్ తేలడంతో దానికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. నర్సింహకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హిజ్రాల బైండోవర్



హిజ్రాలను బైండోవర్ చేస్తున్న పోలీసులు

తుంగతుర్తి, మార్చి 20: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలో సోమవారం వీరంగం సృష్టించిన హిజ్రాలను పోలీసులు బుధవారం బైండోవర్ చేశారు. హిజ్రాల గుంపులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంత్రులకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి 18 మంది హిజ్రాలను బుధవారం స్థానిక తహసీల్దార్ రమణారెడ్డి ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, శ్రీను, ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

మర్రిపడగలో చోరీ


గుండాల, మార్చి 20: యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలంలోని మర్రిపడగ గ్రామంలోని ఓ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఆటిపాముల రాములు తాళం వేసి జనగామకు వెళ్లాడు. మంగళవారం రాత్రి ఇంట్లోకి జొరబడిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బీరువాలో ఉన్న రూ.లక్షా 20వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే విధంగా కొండబోయిన సత్తయ్య ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.10వేల నగదు అపహరించారు. బాధితులు పనులు ముగించుకొని తిరిగి ఇళ్లకు వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

వైభవంగా చక్రతీర్థ స్నానం


● గుట్టలో శాస్త్రోక్తంగా మహాపూర్ణాహుతి ● కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తుల పుణ్యతీర్థ స్నానాలు



విష్ణుపుష్కరిణి చెంతకు ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



దేవతోద్వాసన, భేరీ పూజా వైదిక పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు



విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట, మార్చి20: స్తంభోద్భవుడు.. ఏకశిఖరవాసుడు.. స్వయంభూ పాంచనారసింహుడు వెలిసిన.. మహిమాన్విత యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం శ్రీచక్రత్ ఆళ్వార్ల అవభృత స్నానం, యాగశాలలో మహాపూర్ణాహుతి పర్వాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. అత్యంత ప్రాధాన్యత గల ఘట్టం చక్రతీర్థ స్నాన వేడుక. లక్ష్మీనృసింహుల ఉత్సవమూర్తులను, చక్రత్ ఆళ్వార్లను ప్రత్యేక సేవలో తీర్చిదిద్దిన ఆచార్యులు మంగళవా యిద్యాలు, వేదపారాయణాలు, భక్తుల జయజయ ధ్వానాలు, కోలాట ప్రదర్శనల నడుమ కొండపైన విష్ణుపుష్కరిణి వద్దకు ఊరేగింపుగా తరలి వచ్చారు. వసంతోత్సవం శోభాయమానంగా సాగింది. ప్రభాతవేళ శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరి కార్యక్రమం కొనసాగింది. ఆధ్యాత్మిక ఘట్టాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం, రుత్వికులు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహాపూర్ణాహుతి

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో స్వస్తి పుణ్యాహవాచనంతో ఆరంభించి మహాపూర్ణాహుతి వరకు నిర్వహించే ప్రతీ వేడుక మంగళ ప్రదములే.. విశ్వశాంతి.. లోకకల్యాణంలో కోసం నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలు ఏక కుండాత్మకంగా నవాహ్నికంగా నిర్వహించడం ఆలయ సంప్రదాయం. మహోత్సవాలకు విచ్చేసే అశేష భక్తకోటిని అనుగ్రహింపజేయని కోరుతూ ముప్పై మూడు కోట్ల దేవతలను యాగశాలలో నిత్య హవన పూజలలో ఆయా దేవతలను వారివారి మూల మంత్రాలతో హవిస్సులను అందజేస్తారు. సువృష్టితో లోకాలను క్షేమం కలిగించాలని వేడుకొంటూ మహోత్సవాల పరసమాప్తిగా మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు.

దోపోత్సవం

పరమ భక్తాగ్రేసరుడు, ఆళ్వారాచార్యుడు తిరుమంగైయాళ్వార్ జీవిత చరిత్రను శ్రీవైష్ణవ దేవాలయాల్లో బ్రహ్మోత్సవాల్లో ఉత్సవాంతంగా హరికథా కాలక్షపంలో తెలిపే వేడుకే దోపోత్సవం. భక్తరక్షణా తత్పరుడు శ్రీమన్నారాయణుడుని త్రికరణ శుద్ధిగా కొలిస్తే ముక్తిని ప్రసాదిస్తాడని తిరుమంగైయాళ్వార్ చరిత్ర తెలుపుతోంది. తన ప్రేయసి కుముదవల్లి కోరిక మేరకు ప్రతి నిత్యం 1116 మంది బ్రాహ్మణోత్తములకు అన్న సంతర్పణ చేసేందుకు దారి దోపిడీ దొంగగా మారాడు. అయినా భగవానుడిపై ఆయనకు ఉన్న అచంచలమైన భక్తి విశ్వాసాలతో నిస్వార్థ పూరితంగా జరిపిన అన్న సంతర్పణకు శ్రీమన్నారాయణుడు కరుణించి మొక్షాన్ని ప్రసాదిస్తాడు. నిస్వార్థ భక్తితో స్వామిని సేవిస్తే ఆయన కరుణించి ముక్తిని ప్రసాదిస్తాడని, యావత్ భక్త జనకోటి యజ్ఞయాగాది క్రతువులు ఆచరిస్తూ.. అశేషంగా అన్న సంతర్పణ జరపి భగవానుడి కృపా కటాక్షాలు పొందాలని దోపోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

ముగిసిన సంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండపైన ఈ నెల 15న ఆరంభమైన ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు బుధవారం ముగిసాయి. ఉదయం వీరప్రతాప భజన మండలి, పాండురంగ భజన మండలి, గాయిత్రి భజన మండలిలచే భక్తి భజనలు, బ్రహ్మశ్రీ భాస్కరభట్ల ఆంజనేయశర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం, లక్ష్మీనారాయణ భాగవతార్‌చే హరికథా కాలక్షేపం, సాయంత్రం ఎస్ నాగజ్యోతి, శ్రీమతి కౌటూరి గాయిత్రిలచే భక్తి సంగీతం, శ్రీమతి తోరణాల పద్మచే కర్ణాటక సంగీతం, కుమారి మాహ్నిత కూచిపూడి నృత్యం, శ్రీమతి శోభరాజుచే సంగీత కచేరి, శ్రీమతి జ్వాలాముఖి కూచిపూడి నృత్యం, రిషి డాన్స్ అకాడమిచే పేరిణి నృత్యం, అనంతరం ఆస్థాన విధ్వాంసుల మంగళవాయిద్య కచేరి సంగీత మహా సభల పరిసమాప్తి. యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా జరిగాయి. నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరసామికి నిత్యవిధి కైంకర్యాలు, నిత్య రుద్రహవన పూజలు స్మార్త సంప్రదాయరీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,98,275 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

విష్ణుపుష్కరిణిలో పుణ్యస్నానాలకు అనుమతి

విష్ణుపుష్కరిణిలో చక్రతీర్థ పుణ్యస్నానాలకు భక్తులకు దేవస్థాన అధికారులు బుధవారం అనుమతి ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో విశేష ఘట్టమైన చక్రతీర్థ స్నానం సంప్రదాయరీతిలో కొండపైన సహజ సిద్ధ విష్ణుపుష్కరిణిలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఆలయ ఉద్ఘాటన జరిగిన అనంతరం తొలిసారి బ్రహ్మోత్సవాల్లో మాత్రం దేవస్థాన అధికారులు కొండపైన విష్ణుపుష్కరిణిలో సామాన్య భక్తులను అనుమతించలేదు. ఆలయ పునర్నిర్మాణానికి ముందు, పునర్నిర్మాణ సమయంలోనూ బ్రహ్మోత్సవాల్లో విష్ణుపుష్కరిణిలో సామాన్య భక్తులను చక్రతీర్థ పుణ్యస్నానాలకు అనుమతించారు. ఆలయ జీర్ణోద్ధరణ సమయంలో తాత్కాలిక బాలాలయంలో వేడుకలు నిర్వహించారు. 2022లో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులను పుష్కరిణిలోనికి అనుమతించలేదు. బాలాలయంలోని గంగాళంలోని పవిత్ర జలాలతో అర్చకబృందం సంప్రోక్షణ జరిపారు.

గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పర్యటన సాగిందిలా..

రాష్ట్ర నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ యాదగిరిక్షేత్రాన్ని సందర్శించి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవ కైంకర్యాల్లో పాల్గొన్నారు. ఆయన హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి కాన్వాయ్‌లో రోడ్డుమార్గంలో సాయంత్రం 7.10గంటలకు యాదగిరిక్షేత్రానికి విచ్చేశారు. కొండపైన ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సాయంత్రం సుమారు 8.45గంటలకు తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అనంతరం ఆయన లిఫ్ట్ గుండా ఆలయ తిరువీధుల్లోకి చేరుకుని తూర్పు పంచతల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోకి వచ్చారు. ప్రధానాలయ తూర్పు రాజగోపురం వద్ద దేవస్థాన అర్చకస్వాములు, వేద పండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పరివెట్టం కట్టి పూర్ణకుంభంతో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం తెలిపారు. ఆయన తూర్పు ఈశాన్య త్రితల రాజగోపురం నుంచి ప్రధానాలయంలోనికి ప్రవేశించి ఆంజనేయస్వామికి, గండభేరుండ లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు. ముఖమండపంలో స్వర్ణతాపడ ధ్వజస్తంభం, బలిపీఠంలకు మొక్కి గర్భాయంలోనికి వెళ్లారు. గర్భాలయంలో అర్చకస్వాములు గోత్రనామాలతో సువర్ణ పుష్పార్చన పూజలు జరిపి హారతి, శఠగోపం అందజేశారు. ముఖమండపంలో ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకబృందం, వేదపండితులు చతుర్వేదాలతో ఆశీర్వచనం జరిపారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి ఆయనకు స్వామివారి శేషవస్త్రాలను, అభిషేకం లడ్డూ ప్రసాదాలను అందజేశారు. సీఎస్ శాంతి కుమారి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

యాదగిరీశుడి సేవలో తెలంగాణ సీఎస్ శాంతికుమారి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని బుధవారం సీఎస్ శాంతికుమారి దర్శించుకున్నారు. క్షేత్ర సందర్శనకు విచ్చేసిన ఆమెకు కొండపైన పడమటి దిశలోని లిఫ్ట్ వద్ద యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్రలు మొక్కలను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆమె లిఫ్ట్ గుండా నేరుగా ఉత్తర తిరుమాడవీధి గుండా శివాలయంలోనికి వెళ్లారు. శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివాలయ అర్చకులు పూజలనంతరం ఆమెను ఆశీర్వదించారు.

షేర్‌మార్కెట్‌లో నష్టపోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్, మార్చి 20: షేర్ మార్కెట్‌లో నష్టపోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానికులు, టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణానికి చెందిన గోలి శ్రీనివాసరావు (43) ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా (వర్క్ ఫ్రమ్ హోం) పని చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత రెండేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తగా ఆమె భర్తకు దూరంగా ఉంటోంది. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవలపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం పెట్టుకొని కోర్టు విచారణ ఎదుర్కొంటున్నారు. శ్రీనివాసరావు షేర్ మార్కెట్ వ్యాపారంలో ఆర్థికంగా దెబ్బతిని అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు. భార్య పిల్లలు దూరం కావడం, ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో మానసికంగా కుంగిపోయిన శ్రీనివాసరావు తల్లిదండ్రులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. శ్రీనివాసరావు గదిలో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. షేర్ మార్కెట్ నష్టం, భార్యా పిల్లలు దూరమవడంతో మానసికంగా నలిగిపోతూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాసరావు తండ్రి హన్మంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఎంఐఎం జిల్లా అధ్యక్షుడిపై కేసు నమోదు

నల్లగొండ టౌన్, మార్చి 20: రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో పాటు బందోబస్తులో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్‌తో పాటు అతని అనుచరులపై స్థానిక వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16వ తేదీన రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలెక్టరేట్ జరిగిన సమావేశంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు రజీయుద్దీన్‌తో పాటు మరికొందరు సీఏఏ పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలంటూ మంత్రిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ ఎస్ఐ శంకర్ పిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

మా గోస ఎవరికి చెప్పుకోవాలి?

● ఎండుతున్న పంటల పొలాలు చూసి రైతు కన్నీరు ● పొలం మధ్యలో పడుకొని తన బాధ వెళ్లబోసుకున్న వైనం





పొలంలో పడుకొని రోదిస్తున్న రైతు నర్సింహ

సూర్యాపేటరూరల్, మార్చి 20: ఆరుగాలం కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతుల గోస వర్ణణాతీతంగా మారింది. నీళ్లలేక పంటలు ఎండిపోతుంటే పంటలను చూసి వారు కన్నీళ్లు ఆపుకోలేకపోతున్నారు. వరిపొలం పొట్టకు వచ్చే దశలో పంటకు సాగు నీరు అందక ఎండుతుంటే గోస ఎవరికి చెప్పుకోవాలో తెలియక గుండెలవిసేలా రోదిస్తున్నారు. రైతులు ఎంతో ఆశతో పంటలు సాగు చేస్తే తీరా భూగర్భజలాలు అడుగంటి బోరు బావుల్లో సైతం నీరు రాక దిక్కు తోచని స్థితిలో కన్నీరు మున్నీరవుతున్నారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం అవాసప్రాంతమైన దుబ్బతండాకు చెందిన రైతు దరవత్ నర్సింహ పొలానికి సాగునీరు రాకపోవడంతో పొలంలోనే పడుకుని రోదిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నర్సింహ తనకున్న 20కుంటల భూమితో పాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని ఎస్సారెస్పీ కాల్వ నీళ్లతో ఆధారపడి పొలాన్ని సాగుచేస్తున్నాడు. నాలుగు సంవత్సరాలుగా కౌలుకు తీసుకుని కారుకు 20పుట్ల ధాన్యం పండిస్తున్నాడు. ఇప్పుడు ఎస్సారెస్పీ కాల్వ నీరు రాకపోవడంతో పంటకు నీరు అందడం లేదని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు లేకపాయె అని రైతు పొలం వద్దకు వెళ్లినప్పుడల్లా ఎండిపోతున్న పొలాన్ని చూసి రోదిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 'నన్ను ఆదుకునేది ఎవరు... పంట పెట్టుబడికి రూ.50వేలు పెట్టా.. భూయాజమానికి ఎకరానికి రూ.14వేల చొప్పున కౌలు ఎలా చెల్లించాలో అర్థం కావడంలేదు' అని ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎస్సారెస్పీ కాల్వ కింది రైతులు పెద్ద మొత్తంలో వరిసాగు చేశారని, వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మరిందని గ్రామస్థులు తెలిపారు.

మర్రిగూడలో కారు బీభత్సం

● అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



ఇంటి ఎదుట షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

మర్రిగూడ, మార్చి 20: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బట్లపల్లి గ్రామంలో బుధవారం కారు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన ఆ కారు ఓ ఇంట్లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో యువకుడు గాయపడ్డాడు. ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్ లపంగి కారులో యశ్వంత్ మర్రిగూడ నుంచి నాంపల్లికి వెళ్తున్నాడు. బట్లపల్లి గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పిన కారు సమీపంలో ఓ ఇంటి వైపు దూసుకెళ్లి ముందున్న షెడ్డును ధ్వంసం చేసింది. ఆ సమయంలో అక్కడ ముగ్గురు యువకులు ఉన్నారు. వారిలో ఒకరికి గాయాలయ్యాయి. కారు అతివేగంగా దూసుకెళ్లడంతో రేకుల షెడ్ పూర్తిగా ధ్వంసమైంది. షెడ్డులో ఉన్న రెండు బైకులు కూడా ధ్వంసమైయ్యాయి. కారు తగలడంతో ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూడా ఒరిగింది. కారు డ్రైవర్ అతివేగంగా రావడంతో ఈ సంఘటన జరిగిందని ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్తులు తెలిపారు. ఇంటి యజమాని మాదగోని వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిడ్నాపర్ అనుకొని కూలీని వెంబడించి..

● భయంతో పరుగెత్తి హల్‌చల్ చేసిన కూలీ



కూలీని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మోత్కూరు, మార్చి 20: రోడ్డు పనికి వచ్చిన కూలీని కిడ్నాపర్‌గా అనుమానించిన గ్రామస్థులు అతన్ని వెంబడించగా పోలీసులు అదుపులోకి తీసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అనాజిపురం వద్ద వలిగొండ-తొర్రూరు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. సికింద్రాబాదు రైల్వే స్టేషన్‌లో బిక్షమెత్తుకుంటున్న ఒడిస్సా రాష్ట్రానికి చెందిన సహదేవ్ అనే వ్యక్తిని రోడ్డు లేబర్ కాంట్రాక్టర్ జయకృష్ణ నిర్మాణ పనులు చేసేందుకు కూలీగా తీసుకువచ్చాడు. వారం రోజులుగా అనాజిపురంలో రోడ్డు పనిచేస్తున్న సహదేవ్ గ్రామంలోని బుడిగ జంగాల కాలనీకి వెళ్లగా కొత్త వ్యక్తి కావడంతో కుక్క మొరిగింది. దీంతో కాలనీవాసులు ప్రశ్నించగా అతనికి తెలుగు రాక, కాలనీవాసులు అడిగేది అతనికి అర్థం కాకపోవడంతో చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే కిడ్నాపర్‌గా అనుమానించిన కాలనీవాసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. తనను కొడతారేమోనన్న భయంతో సహదేవ్ పరుగెత్తడంతో కాలనీవాసులు, గ్రామస్థులు వెంబడించారు. పరుగెత్తుతూనే తనను వెంబడిస్తున్న ప్రజలను బెదిరిస్తూ ఓ ప్రజాప్రతినిధి గెస్ట్‌హౌస్ ఆవరణలోకి వెళ్లి గేటు మూసి లోపల గడియ వేసుకున్నాడు. తోట పనికి ఉపయోగించేందుకే అక్కడ ఉంచిన కర్ర, కత్తి, ఇనుపరాడ్‌తో ప్రజలను బెదిరించాడు. సమాచారం తెలిసిన పోలీసులు ప్రహరీ గోడపైనుంచి ఆవరణలోకి దిగి సహదేవ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విషయం తెలుసుకున్న రోడ్డు లేబర్ కాంట్రాక్టర్ అక్కడికి చేరుకుని కూలి పనుల నిమిత్తం తానే తీసుకువచ్చినట్లు వివరించటంతో అతనితోపాటు పంపారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భాష తెలియక పోవడంవల్లే ఇదంతా జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నాపర్లెవరూ సంచరించడం లేదని, కిడ్నాపర్లు తిరుగుతున్నారన్న వదంతులను నమ్మవద్దన్నారు. అలాంటిదేమైనా ఉంటే తామే ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

వందేళ్లుగా నిరంతరం నీరు

» 30 మోటార్లను అమర్చిన బూరుగడ్డ, మాచవరంగ్రామస్థులు » వేసవిలోవరం

మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామాల మధ్య ఉన్న వందేళ్ల నాటి బావి ప్రజల దాహార్తిని తీరుస్తోంది. మండు వేసవిలో కూడా నిండుకుండలా ఉండి రెండు గ్రామాల్లోని ఎన్నో కుటుంబాలకు నీరందిస్తోంది. 40 అడుగుల లోతులో ఉన్న గిరకల బావి మంచినీటిని అందించడంతో పాటు ఇతర నీటి అవసరాలను కూడా తీరుస్తోంది.

- హుజూర్‌నగర్



మంచినీటి బావికి 30కి పైగా మోటార్లు ఏర్పాటు చేసుకున్న గ్రామస్థులు

ఈ గిరకల బావి పాత గ్రామపంచాయతీ సమీపంలో ఉంది. బూరుగడ్డ, మాచవరం గ్రామాలు బూరుగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. ఈ రెండు గ్రామాల మధ్యే ఈ బావి ఉంది. ఈ రెండు గ్రామాలు కలిసి ఉండగా, ఈ రెండు గ్రామాలకు ఒక బజారు అడ్డుగా ఉంది. ఒక బజారుకు రెండు వైపులా బూరుగడ్డ, మాచవరం గ్రామాలు ఉన్నా యి. గిరకలబావి నుంచి ఆయా గ్రామస్థులు బకెట్లతో నీటిని తోడకుండా ఏకంగా మోటార్లు ఏర్పాటుచేసుకున్నారు. 30ఇళ్ల వారు బావిలో సబ్‌మెర్సిబుల్ మోటార్లు ఏర్పాటు చేసుకుని పైపులు ద్వారా తమ ఇళ్లకు నీటిని తరలించుకుంటున్నారు. ఇళ్లల్లోనే ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసుకున్నా రు. ఎంత మంది మోటార్లు వేసినా బావిలో నీరు నిరంతరం నిండుకుండలా ఉంటుందని, ఇప్పటివరకు బావి ఎండిపోలేదని ఆయా గ్రామస్థులు తెలిపారు.బూరుగడ్డ, మాచవరం గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంది. మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు నామమాత్రంగానే అందుతున్నాయని, ఈ నేపథ్యంలో వేసవిలో కూడా వందేళ్ల చరిత్ర కలిగిన గిరకల బావి తమకు ఎంతగానో ఉపయోగపడుతోందని ఆయా గ్రామస్థులు సంతోషం వెలిబుచ్చారు.

ఆటోల్లో ప్రాణాంతకంగా ప్రయాణం

రోడ్డు ప్రమాద మృతుల్లో 40శాతం వారే..

సూర్యాపేట టౌన్, మార్చి 20: ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారిపై వాయు వేగంతో వస్తున్న వాహనాలు రెప్పపాటులో ఆటోలను ఢీకొడుతున్నాయి. వ్యవసాయ సీజన్లో సాధారణంగా ఆటోల్లో కూలీలు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఆటోల్లో ప్రయాణిస్తే పేద, బడుగు వర్గాలకు చెందిన కూలీలే ఎక్కువగా చనిపోతున్నారు. దీంతో ఆ కుటుంబాలకు తీరని శోకం మిగులుతోంది. ఆ కుటుంబాల్లోని పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ఏడు సీట్ల కెపాసిటీ ఉన్న ఆటోలు రాకపోకలు సాగిస్తున్నాయి. పల్లెకు తగినన్ని ఆర్టీసీ బస్సులు లేకపోవడం, సమయానికి రాకపోవడం, వచ్చినా అవి రద్దీగా ఉండటం తదితర కారణాలతో గ్రామీణులు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా ఉండటం, పరిమితికి మించి ప్రయాణం, మైనర్లు డ్రైవింగ్ చేయడం, కండీషనల్‌లో లేని ఆటోలతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఉమ్మడిజిల్లాలో సగటున రోజుకు ఒకరు మృతి

జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో జిల్లాలో సగటున రోజుకు ఒకరు మృతి చెందుతున్నారు. ఇటీవల అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామ శివారులో ఆటోను కారు ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఒక మహిళ మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఏడాది మోతె మండలంలో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఐదుగురు కూలీలు అక్కడిక్కడే మృతిచెందడం విషాదాన్ని నింపింది. జాతీయ రహదారిని కలుపుకుని ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2022 సంవత్సరంలో 327ప్రమాదాలు జరుగగా 344మంది మృత్యువాత సాధారణ ప్రమాదాలు 499జరుగగా 719 మంది గాయపడ్డారు. అదేవిధంగా 2023లో తీవ్రప్రమాదాలు 309జరుగగా, 335 మంది చనిపోయారు. సాధారణ ప్రమాదాలు 493జరుగగా 785మంది గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో 40శాతం వరకు ఆటోల్లో ప్రయాణిస్తున్నవారే ఉంటున్నారు.



ఆటోలో ప్రమాదకరంగా వెళుతున్న ప్రయాణికులు(ఫైల్)

పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దు

ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం

● సాయిరాం, ట్రాఫిక్ ఎస్ఐ

డీఎస్సీశిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలి

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 20: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ కోసం ఉచిత శిక్షణకు అర్హులైన ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు, జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి కె.లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైట్, బీఈడీ ఉత్తీర్ణులైన సూర్యాపేట, జనగాం జిల్లాల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వీరిలో 100మందిని ఎంపిక చేసి ఉచిత శిక్షణ, వసతి కల్పిస్తామన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఏప్రిల్ మూడో తేదీ నుంచి జూన్ రెండో తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు సెల్ నెం.9989129935ను సంప్రదించాలన్నారు.

మహిళల రక్షణకు ఎనలేని కృషి

సూర్యాపేట క్రైం, మార్చి 20: మహిళల రక్షణకు ఎనలేని కృషి చేస్తున్నామని సూర్యాపేట షీటీం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. షీటీం ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేటలోని సాయి త్రివేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆకతాయిలు వేధిస్తే మహిళలు, విద్యార్థినులు డయల్-100కు సమాచారం ఇవ్వాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం పోలీస్ కళాబృందం సభ్యులు పలు సామాజిక అంశాలపై ఆట-పాటలతో అవగాహన కల్పించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, కరస్పాండెంట్ జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్ అనిల్, షీటీం సభ్యులు జాఫర్, ఎల్లయ్య, గోపి, చారి, కృష్ణ, శివరాం పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లు



చింతపాలెం మండలం దొండపాడులో స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మేళ్లచెర్వు, మార్చి 28: విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నామని ఏహెచ్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకుడు, డీసీసీబీ ఆజీ చెర్మన్ అన్నపురెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఏహెచ్ఆర్ ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం చింతలపాలెం మండలంలోని దొండపాడు గ్రామంలోని అరుణోదయ హైస్కూల్‌లో 45 మంది పేద విద్యార్థులకు రూ.2.94లక్షల విలువైన చెక్కులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నిరంజన్, శాంతారెడ్డి, కార్తీక్, వట్టెపు సైదులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 33గొర్రెల మృత్యువాత

తిరుమలగిరి రూరల్, మార్చి 20: తిరుమలగిరి మండలంలోని వెలిశాల గ్రామంలో మంగళవారం రాత్రి కుక్కల దాడిలో 33గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లంల సమ్మయ్యకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 33గొర్రెలు మృతిచెందగా, ఆరు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. మృతిచెందిన గొర్రెల విలువ రూ.3 లక్షల వరకు ఉంటుందని బాధితుడు సమ్మయ్య తెలిపాడు. గొర్రెల పెంపకమే ఆధారంగా జీవిస్తున్న తనను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

ఆర్థిక లావాదేవీలతో వ్యక్తిపై హత్యాయత్నం



దాడిలో గాయపడిన శంషేర్

మేళ్లచెర్వు, మార్చి 28: ఆర్థిక లావాదేవీల విషయంలో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెర్వు మండల కేంద్రానికి చెందిన గోపిశెట్టి శంకర్, చింతలపాలెం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన ఎస్‌కే శంషేర్ మధ్య ప్లాట్ల ఆర్థికలావాదేవీల విషయంలో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం, శివాలయం ఎదురుగా ఉన్న గాలి మిషన్ ద్వారా శంషేరు తన బైకు టైరులో గాలి నింపుతుండగా వెనుక నుంచి వచ్చిన శంకర్ కత్తితో వెనుక నుంచి దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన శంషేర్‌ను మొదట హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శంషేర్ సోదరుడు రసూల్ ఫిర్యాదు మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గీతకార్మికుడి మృతి

ఆత్మకూర్(ఎస్), మార్చి 20: మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన యర్రగాని వెంకన్న(54) ఈ నెల 16న తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రగాయాలయ్యాయి. ఆయనను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పేదరికంలో ఉన్న వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతరం వెంకన్న మృతదేహానికి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, తండ రమేష్, నోముల వెంకన్న, కాట్ల వెంకన్న, మామిడి లింగయ్య, యర్రగాని నారాయణ, ఉయ్యాల మల్సూర్, యర్రగాని శ్రీను, పాండయ్య, ఉపేందర్, లింగయ్య, సురభి సైదులు, ఎరుకల లింగయ్య తదితరులు ఉన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోదాడ రూరల్, మార్చి 20: మండలంలో నాలుగు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగలితండా గ్రామం పక్కన ఉన్న పాలేరు వాగు నుంచి బుధవారం ఉదయం ఇసుకను అక్రమంగా కోదాడకు తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను దొరకుంట వద్ద పట్టుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకుంటే చర్యలు

సూర్యాపేట రూరల్, మార్చి 20: నిత్యావసర వస్తువులపై ఎమ్మార్పీ కంటే అధికంగా డబ్బులు తీసుకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కృష్ణ అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని రాయినిగూడెం సమీపంలో ఉన్న సాయికృష్ణ రెస్టా రెంట్‌లో ఎమ్మార్పీ కంటే అధిక ధరకు వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ విక్రయిస్తున్నారని ఓ వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుదవారం రెస్టారెంట్‌లో ఉన్న కూల్‌డ్రింక్స్ స్టాల్స్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో ఒక్కో వాటర్ బాటిల్స్‌పై రూ.5లు, బిస్కెట్స్, హల్దీరామ్ ప్యాకెట్స్‌పై ఎమ్మార్పీ కంటే అధికంగా తీసుకుంటున్నారని తెలడంతో కూల్‌డ్రింక్స్ షాపుపై కేసు నమోదు చేశారు. ఎమ్మార్పీ కంటే ఎవరైనా అధిక ధరకు విక్రయిస్తే వినియోగదారులు ఫిర్యాదు చేయాలని సూచించారు .

'కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతోనే ఇంటి కూల్చివేతకు యత్నం'

అనంతగిరి, మార్చి 20: కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే ఇళ్లు కూల్చేందుకు అధికారులు యత్నించారని సీపీఐ మండల కార్యదర్శి బద్దం కృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని శాంతినగర్ గ్రామంలో ఖమ్మం-కోదాడ రహదారి విస్తరణలో తన ఇల్లు 90 శాతానికి పైగా పోతుందన్నారు.ఈ ఇంటికి సంబంధించిన నష్టపరిహారం కూడా ప్రభుత్వం నుంచి తీసుకున్నానన్నారు. ఇంటిని తానే తొలగిస్తానని అధికారులకు హామీ ఇచ్చినా, కాంగ్రెస్ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చారన్నారు. స్వచ్ఛందంగా ఇంటిని కూల్చికున్నందున 10శాతం ఇంటిని కాపాడుకోగలిగానని, అధికారులు తొలగిస్తే ఇల్లు మొత్తం పోయేదన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయసాధనకు కృషిచేయాలి

తిరుమలగిరి, మార్చి 20: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషిచేయాలని సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అన్నారు. బుధవారం తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కడెం లింగయ్య, నీర్మాల యాకయ్య, పోరెల్ల లక్ష్మయ్య, కడారి లింగయ్య, నలుగూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

మోతె, మార్చి 20: ప్రభుత్వ భూములను ఇళ్ల స్థలాల పేరిట ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సంఘమిత్ర హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయం వెనుక డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించిన తర్వాత మిగిలిన ప్రభుత్వ స్థలాలను కొందరు అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్‌తో కలిసి భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎవరైనా బాటలకు కంప వేసినా, ఖాళీ స్థలాన్ని ఆక్రమించినా ఎక్స్‌కవేటర్ యజమానులపై, తాపీ మేస్త్రీలపై కేసులు నమోదు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు మన్సూర్ అలీ, అజయ్, సర్వేయర్ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

కోదాడ రూరల్, మార్చి 20: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి నాగేంద్రబాబు సూచించారు. బుధవారం మండలంలోని రామలక్ష్మీపురం, గణపవరం గ్రామాల్లో పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేయడంతో, రక్త నమూనాలు సేకరించారు. టీకా శిబిరాలను ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ పరిశీలించారు. 184 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, ఖాన్, హుస్సేన్, శరత్, రైతులు వెంకటరెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా మత్స్యసహకార సంఘం ఎన్నికలు



గెలుపొందిన సభ్యులకు ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి అశోక్‌కుమార్

మఠంపల్లి, మార్చి 20: మఠంపల్లిలో బుధవారం జరిగిన మత్స్య సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సంఘం పరిధిలో మొత్తం 281మంది సభ్యులు ఉండగా 256మంది ఓట్లు వేశారు. పాలకవర్గంలో ఇద్దరు మహిళలు, మిగిలిన ఏడుగురు సభ్యులకు 24 మంది పోటీపడ్డారు. సంఘం అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడ్డారని, సభ్యులుగా తొమ్మిది మందిని రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. అధ్యక్ష ఉపాధ్యక్ష, కార్యదర్శిలను గురువారం ఎన్నుకుంటారని ఆయన తెలిపారు. పదవులకు గురువారం ప్రతిస్తామని అధికారి తెలిపారు. 281మంది సభ్యుల్లో 28మంది పోటీపడగా సభ్యులుగా తొమ్మిది మందిని ఎన్నుకున్నారన్నారు. విజేతలకు ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. ఈ తొమ్మిది మందిలో అధ్యక్షుడిగా తవడబోయిన నాగేశ్వరావు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఎన్నికలు సజావుగా జరిగేందుకు మఠంపల్లి ఎస్ఐ ఎం.రామాంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ అధికారిగా దరావత్ నాగేశ్వరరావు వ్యవహరించగా, రామచంద్రయ్య, షేక్ బడేసాహెబ్, అంజయ్య ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు.

విజేతలు వీరే..సభ్యులుగా కర్నె సైదమ్మ, బుద్ది సక్కుబాయమ్మ, తవడబోయిన నాగేశ్వరావు, చింతల లక్ష్మీనారాయణ, చింతల వీరబాబు, చాగంటి నర్సింహారావు, తుంగం వీరయ్య, తవడబోయిన వీరయ్య, తవడబోయిన కృష్ణ విజయం సాధించారు.

రేపాల నృసింహుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మునగాల రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని రేపాల గ్రామ శివారులో గుట్టపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలోని కోదండరామాలయం నుంచి నరసింహుని ఉత్సవ విగ్రహాలను రేపాల గ్రామానికి తీసుకువచ్చి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గుట్ట పైకి చేర్చారు. స్వామి రాకతో గ్రామంలో ఉదయం ఐదు గంటలకే ప్రతి ఒక్కరూ ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి స్వామికి మంగళహారతులు, కొబ్బరికాయలు ఇచ్చి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. స్వామి ఊరేగింపులో నరసింహుని, వినాయక వేషధారణలు, కోలాట నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ సారిక రామయ్య, ప్రధాన అర్చకుడు చివలూరి రామకృష్ణాచార్యులు, చిట్యాల నర్సింరెడ్డి, ఎంపీటీసీ ఎస్ మోహన్, ఎలక నరేందర్‌రెడ్డి, పల్లి వీరారెడ్డి, వరికెల రమేష్, ఉపేందర్, గోవర్ధన్‌రెడ్డి, అక్కిరాజు గోపి, బత్తుల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21న అధ్యయనోత్సవం, 22 పరమపదోత్సవం, 23న ధ్వజారోహణ, 24న డోలోత్సవం, రాత్రి ఎదుర్కోలు, కల్యాణం, 25న లక్ష కుంకుమార్చన, రాత్రి గరుడ సేవ, 26న రథోత్సవం, 27న చక్రతీర్థం, 28న మధ్యాహ్నం గాంధోళి (వసంతోత్సవం), 29న పవళింపు సేవ, అనంతరం స్వామి తిరిగి సిరిపురం గ్రామంలోని రామాలయానికి తీసుకువెళతారు.



ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, కమిటీ నిర్వాహకులు

ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలి



నెమ్మికల్ గ్రామంలో కవాతు చేస్తున్న పోలీసులు

ఆత్మకూర్(ఎస్), మార్చి 20: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని డీఎస్పీ రవి అన్నారు. ఆత్మకూర్(ఎస్)మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన ఆత్మకూర్ (ఎస్), గట్టికల్, నెమ్మికల్ గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో బుధవారం కవాతు నిర్వహించారు. అనంతరం ఎన్నికల నియామవళిపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూప్ అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. అభ్యంతరకరమైన , అశ్లీయమైన ఇతరుల మనోభావాలను కించపరిచే విధంగా పోస్టులు చేసిన సభ్యుడితో పాటుగా గ్రూప్ అడ్మిన్ పై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ సైదులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బు, మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

అర్వపల్లి: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మద్యం, డబ్బులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అర్వపల్లి ఎస్ఐ యాకుబ్ అన్నారు. బుధవారం అర్వపల్లి మండల కేంద్రంలో కార్లు, బైకులు, లారీలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పాటుపడాలి: వెంకన్న

కోదాడ రూరల్, మార్చి 20:రైతుల సంక్షేమానికి సహకార సంఘాల పాటుపడాలని సొసైటీల శిక్షణ నిర్వాహకుడు వెంకన్న అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలోని సహకార సంఘాల చైర్మన్లకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణకు మండలంలోని సహకార సంఘాల చైర్మన్లు నంబూరి సూర్యం, ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు చిలుకూరు, రాయినిగూడెంతో పాటు పలు సహకార సంఘాల చైర్మన్లు హాజరయ్యారు. ఉత్తమ సహకార సంఘాలుగా కాపుగల్లు, కోదాడ ఎంపికైనందున ఈ సందర్భంగా ప్రశంసతాపత్రాలు అందించినట్లు చైర్మన్ నంబూరి సూర్యం, ఓరుగంటి శ్రీనివాస్ తెలిపారు.



చైర్మన్లకు సొసైటీ గుర్తింపుపత్రాలు అందిస్తున్న వెంకన్న

కాంగ్రెస్ గెలిస్తే అభయహస్తం కాదు.. బస్మాసుర హస్తం

తుంగతుర్తి, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే అభయహస్తం కాదు.. బస్మాసుర హస్తం అవుతుందని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం తుంగతుర్తిలో బీజేపీ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధర్మం, అధర్మం మధ్యే పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. శత్రుదేశాలు భారతదేశం వైపు కన్నెత్తి చూడడానికే భయపడే విధంగా మోదీ పాలన కొనసాగిస్తున్నారని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో అన్ని కుంభకోణాలే అని, బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమానంగా అమలు చేస్తూ దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకువెళుతోందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ వ్యతిరేకతతోనే కాంగ్రెస్‌కు ఓటు వేశారని, కాంగ్రెస్‌పై ప్రేమతో ఓటు వేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది మురిగిపోయినట్లేనని. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, కాప రవికుమార్, మల్లెపాక సాయిబాబా, గాజుల మహేందర్, అంబటి రమేష్, లింగయ్య పాల్గొన్నారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

ఎస్సీ కాలనీలకు ఉచితంగా మీటర్లు, విద్యుత్ అందించాలి

చిలుకూరు, మార్చి 20: ఎస్సీ కాలనీల్లో ఉచితంగా విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా కరెంట్ అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెమిడాల రాజు కోరారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కాలనీవాసులకు ఉచిత కరెంట్ అని చెబుతున్న అధికారుల, మరో వైపు ఇళ్లకు విద్యుత్ మీటర్లు లేవని కేసులు రాస్తున్నారని, జరిమానాలు విధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఎస్సీ కాలనీల్లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ అందించాలని డిమాండ్ చేశారు.

స్నేహితుడికి ఆర్థికసాయం



స్నేహితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

అర్వపల్లి, మార్చి 20: ఇటీవల కారు-ఆటో ఢీకొన్న ప్రమాదంలో మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బొడ్డు లక్ష్మణ్ గాయపడ్డాడు. లక్ష్మణ్‌కు బుధవారం తిమ్మాపురంలో ఆటో యూనియన్ తరపున రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు నాగరాజు, సుధాకర్, వెంకన్న, రవి పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో యువతకు స్వయం ఉపాధి



గడ్డిపల్లి కేవీకేలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ సుకుమార్

గరిడేపల్లి, మార్చి 20: సేంద్రీయ వ్యవసాయం, తేనెటీగల పెంపకంతో యువతకు ఆరోగ్యం, ఉపాధితో పాటు రైతులకు అధిక ఆదాయం వస్తుందని స్టేట్ బ్యాంక్ గడ్డిపల్లి బ్రాంచి మేనేజర్ ఎంకే సుకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో యువతకు, రైతులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయం చేపడితే యువతకు ఉపాధి, రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. నూతనంగా తేనెటీగల పెంపకం చేపట్టిన యువతకు, రైతులకు సబ్సిడీలు, లోన్లు ఇస్తామని, వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త జీహెచ్ నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీలను వెంటనే చెల్లించాలి

గరిడేపల్లి, మార్చి 20: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల మెస్ చార్జీలను వెంటనే చెల్లించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాళ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థుల 10నెలల మెస్ చార్జీల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. మెస్ బిల్లులను విడుదల చేయనందున హాస్టళ్లకు సరఫరా చేసే నిత్యావసరాలను వ్యాపారులు నిలిపి వేశారని, దీంతో హాస్టళ్లను మూసివేసే దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా హాస్టళ్లలో సమయానికి ఆహారం అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఉన్న 700బీసీ, 1500 ఎస్సీ ఎస్టీ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. బీసీ గణనతో పాటు బీసీ రాజకీయ రిజర్వేషన్ బిల్లు కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు.

వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డు మృతి



అనంతరావు (ఫైల్ ఫొటో)

తిరుమలగిరి, మార్చి 20: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో 35ఏళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మునిసిపాలిటి కేంద్రానికి చెందిన పెరుమాళ్ల అనంతరావు అలియాస్ చిన్ని(55) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. అనంతరావు మృతికి మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, మాజీ ఎంపీపీ సతీష్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మార్కెట్ సిబ్బంది, హమాలీలు, కార్మికులు సంతాపం తెలిపారు.

ఠానునాయక్ సేవలు మరవలేనివి

మఠంపల్లి, మార్చి 20: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుడు జాటోత్ ఠానునాయక్ చేసిన సేవలు మరవలేనివని, ఆయనను ప్రతి గిరిజన నాయకుడు ఆదర్శ తీసుకొని ముందుకు సాగాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు భూక్యపాండునాయక్ అన్నారు. 74వ వర్ధంతి వేడుకలను తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మఠంపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం ఎట్టి చాకిరి ఈ ముక్తి కోసం పోరాటం, దున్నేవాడికి భూమి ఇవ్వాలనే ఉద్యమంతో పోరాటం చేసి వీరమరణం పొందిన ఘనడు ఠానునాయక్ అని కొనియడారు. గిరిజన సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మాలోతుబాలునాయక్, నాయకులు స్వామీనాయక్, సురేష్‌నాయక్, శ్రీనునాయక్, కోటయ్య, బానోతు నాగేశ్వరావునాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా నృసింహుని కల్యాణం

మఠంపల్లి, మార్చి 20: మట్టపల్లి క్షేత్రంలో బుధవారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా అర్చకులు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ధర్మకర్తలు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, అర్చకులు పాల్గొన్నారు.